మినీకథ :

# అంతర్యాలం

అదొక చిన్న పీ హెచ్ సీ. ఆ పీ. హెచ్. సీ ఉన్నదొక పల్లెటూరిలో ఆ హాస్పిటల్‌లో ఓ డాక్టరూ, తదితర పరివారమూ వున్నారు. ఆ పీ హెచ్ సీ. లో ఓ వేక్సినేషన్ డిపార్ట్‌మెంట్. అందులో ఓ ఉద్యోగి

ఉదయం ఎనిమిది గంటలయింది. ఓ ఇంటి ముందు ఆగి తలుపుతట్టాడు శంకర్రావు అతనే వేక్సినేషన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి.

తలుపు తెరుచుకుంది

"అమ్మా! అందరూ క్షేమమేనా?"

"ఆఁ! అందరూ బాగానే వున్నారండీ"

వెంట తెచ్చుకున్న లావుపాటి బౌండ్ పుస్తకంలో ఆల్ ఆర్ గుడ్ అండ్ హెల్తీ ఎక్కించబడింది.

మరో ఇంటికి

"ఏవేఁ! నీ ఇంట్లో అందరూ బాగేనా?" తేడా పలకరింపులో

"బాఁనే వున్నాడు బాఁవూ నీ దయ వల్ల."

మరో ఇంటికి. ఆ ఇంట్లో పల్లెటూరి వాతావరణం ప్రతిబింబిస్తోంది ఓ ప్రక్కన గొడ్లచావిడి. మరోపక్క ధాన్యంగాదె, వరండా స్తంభానికి కట్టబడిన ఓ బుల్లి ఆవూ, దాని మలమూత్రాలు ఇంకో ప్రక్క వంట చేస్తూన్నారనడానికి నిదర్శనంగా అక్కడ దట్టంగా పొగా అలాటి చోట రోగంతో పడుకున్న పిల్లవాడు

కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతూన్న ఆ పిల్లవాణ్ణి శంకర్రావుకి తీసుకువచ్చి చూపించారు.

"అరరే! ఎప్పట్ణించమ్మా వీడికి " సంగతీ సందర్భాలు తెలుసుకొని, "వీడికీ మందు పట్టండి మూడు పూటలా. ఇదిగో ఈ ఇంజక్షన్ యిస్తాను. రాత్రికి తగ్గిపోతుందిలే." భరోసా ఇచ్చాడు.

* * *

"ఏమండీ' రాజుకి పొద్దున్న అన్నం తిన్నదగ్గర్నుండీ కడుపులో నెప్పటండీ. పొద్దున్న యిలా అన్నం తిని వెళ్ళాడో లేదో వెంటనే వచ్చి కడుపులో నొప్పని ఒకటే ఏడుపు "

రాజు శంకర్రావుకి లేకలేక కలిగిన కొడుకు. అతనికేమయినా అయితే శంకర్రావు ప్రాణాలు విలవిలలాడిపోతాయి.

గాభరా పుట్టింది అపెండిసైటిస్ యేమోనని భయం, ఇరవైనాలుగ్గంటల లోగా ఆపరేషన్ చేయకపోతే పిల్లవాడి ప్రాణానికే ప్రమాదం ఏం చెయ్యాలి? తనదగ్గర మందులిస్తేనో. అమ్మో? టైము రాత్రి ఎనిమిది. ఇపుడు కర్తవ్యమేమిటి?

శంకర్రావు భుజాన పిల్లవాణ్ణి వేసుకొని డాక్టరుగారింటికి బయలుదేరాడు.

కాని

సాయంత్రం అయిదుగంటలకే డాక్టరుగారు విశాఖపట్నం కే జీ. హెచ్.కి వెళ్ళేరుట.

కారణం. ఆయన మూడో కొడుక్కి కడుపునొప్పి విపరీతమైపోతే పట్నంలో పెద్ద డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళేరుట

—వేణు